
సాక్షి
బాపట్ల
మంగళవారం ၊ 29 ၊ అక్టోబర్ ၊ 2024



వెల్లటూరులో పారాయణం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరులో కొలువైన కట్లమ్మ తల్లి దేవస్థానంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం పారాయణ కార్యక్రమం నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 6908 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1748 క్యూసెక్కులు వదిలారు.

విఘ్నేశ్వరునికి వెండి కిరీటం



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో విఘ్నేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన పరిమి రామనరసింహం రూ.1.20 లక్షల విలువైన వెండికిరీటాన్ని సోమవారం సమర్పించారు. అనంతరం విఘ్నేశ్వరునికి కిరీటాన్ని అలంకరించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ : జేసీ

బాపట్ల: పేద కుటుంబాలకు మూడు ఉచిత సిలిండర్ల కార్యక్రమానికి మంగళవారం నుంచి బుక్ చేసుకోవచ్చని జేసీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డు, ఆధార్ నంబరుతో లింక్ అయిన బ్యాంకు ఖాతా, గ్యాస్ కనెక్షన్ నంబర్‌తో ఏజెన్సీల వద్ద గానీ సెల్‌ఫోన్‌లో గానీ బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. గ్యాస్ సిలిండర్లకు మొదట ఖాతాదారులు సొమ్ము చెల్లిస్తే, తిరిగి ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. లబ్ధిదారులు 29 నుంచి 31వ తేదీ వరకు గ్యాస్‌ను బుక్ చేయించుకోవాలని సూచించారు. ఏప్రిల్ నుంచి జులై, ఆగస్టు నుంచి నవంబరు, డిసెంబరు నుంచి మార్చి వరకు మూడు సిలిండర్లు ఇచ్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ పథకంలో లబ్ధి పొందిన వారు బ్లాక్‌మార్కెట్‌లో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు.

చీరాల ఆర్డీవోగా చంద్రశేఖర్‌నాయుడు



చీరాల: చీరాల ఆర్డీవోగా టి.చంద్రశేఖర్ నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న దేవరకొండ అఖిల రామచంద్రాపురం బదిలీ కాగా తిరుపతి ప్రోటోకాల్-2 అధికారిగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌నాయుడును చీరాలకు కేటాయించారు. నూతన ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళిని ఆయన మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. నూతన ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు డివిజన్ పరిధిలోని చీరాల, వేటపాలెం, కారంచేడు, చినగంజాం మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, అభినందనలు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



చీరాల: ఆపద సమయాల్లో రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు నిలబెట్టవచ్చని డీఎస్పీ జగదీష్ నాయక్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం చీరాల ఏరియా వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చీరాల డివిజన్ సీఐలు, ఎస్‌ఐలు, జర్నలిస్టులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి డీఎస్పీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసరావు, శేషగిరిరావు, నాగభూషణం, ఎస్‌ఐలు కమలాకర్, వెంకటేశ్వర్లు, జర్నలిస్ట్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

చేబ్రోలు: చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణ సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో అక్టోబర్ 30న బుధవారం డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళాను జిల్లాలోని ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టెన్త్, ఇంటర్, డిప్లమా, ఐటీఐ లేదా డిగ్రీ ఆపైన అర్హత కలిగిన వారు మేళాలో పాల్గొనాలని వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు.

యార్డుకు 63,735 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 63,735 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 54,065 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,400 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,300 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 28,584 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

తీరంలో పైసా వసూల్

పర్యాటకులకు పచ్చ నేతల 'పన్ను పోటు'

- సూర్యలంక తీరానికి వచ్చిన ఒక్కొక్కరికీ రూ. 20 పన్ను
- బాపట్ల ఎమ్మెల్యే వర్మ ప్రతిపాదన, అధికారుల తీర్మానం
- దోపిడీకి దిగుతున్న పచ్చ నేతలు
- వాహనాలకు ఇప్పటికే పన్ను వసూళ్లు
- లెక్కాపక్కా లేకుండా దోచే ఎత్తుగడ
- సూర్యలంక తీరానికి నెలకు 1.20 లక్షల పర్యాటకులు రాక
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు, పర్యాటకులు



సూర్యలంక తీరంలో పర్యాటకుల సందడి (ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: పచ్చ నేతల దోపిడీకి అంతే లేకుండా ఉంది. ప్రజలపై ఎడాపెడా పన్నులు వేసిన తుగ్లక్‌ను తలపిస్తున్నారు. ఇసుక, బుసక, మట్టి, గ్రావెల్, గ్రానైట్ సహా దేన్నీ వదలని పచ్చ నేతల కన్ను ఇప్పుడు సూర్యలంక సముద్ర తీరంపై పడింది. పర్యాటకులపై పన్నులు వేసే సరికొత్త దందాకు తెరలేపారు. బీచ్ చూసేందుకు వచ్చే ఒక్కో తలకు రూ. 20 లు కప్పం కట్టాలని తీర్మానించారు. అంతేకాదు వారు వచ్చే బైక్, ఆటో,కారు, బస్సు ఏదైనా సరే టోల్‌గేట్ చెల్లించాలని ప్రతిపాదించారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ శుక్రవారం జరిగిన బాపట్ల మున్సిపల్ సమావేశంలో ఈ తీర్మానం చేయగా సభ్యులు, అధికారులు చప్పట్లతో ఆమోదించారు. ఈ నెలాఖరు నుంచే వాహనాల నుంచి, ఆ తర్వాత సందర్శకుల నుంచి పన్నులు వసూలు చేయనున్నారు. పచ్చనేత తీర్మానంపై పర్యాటకులు మండిపడుతున్నారు.

వారాంతంలో పర్యాటకుల తాకిడి

ప్రతి శని, ఆదివారాల్లో సూర్యలంక తీరానికి మన రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు తెలంగాణా నుంచి పర్యాటకులు అధికంగా వస్తారు. వారాంతంలో రెండు రోజులు 20 వేల మంది, మిగిలిన ఐదు రోజుల్లో 10 నుంచి15 వేల మంది చొప్పున వస్తారు. నెలకు 1.20 లక్షల మందికి తగ్గకుండా పర్యాటకులు వస్తున్నారు. ఈ లెక్కన రూ. 24 లక్షల రాబడి వస్తోంది.దీంతోపాటు చాలా కాలం నుంచి ఇక్కడ వాహనాలకు టోల్‌గేట్ పెట్టారు. టూవీలర్ రూ. 15, ఆటోకు రూ. 30, కారుకు రూ. 50 , బస్సుకు రూ. 100 చొప్పున వసూలు చేస్తున్నారు. గత ఏడాది వేలం పాట రూ. 30 లక్షలు పలికింది. దీంతోపాటు ఇక్కడి కొన్ని టాయిలెట్స్, బాత్ రూములు ఏర్పాటు చేసి నిర్వహణ కోసం వేలం పాట పెట్టగా ఏడాదికి రూ. 5 లక్షలకు పాడుకున్నారు. ఇవి కాకుండా బల్లలు, గుర్రాలు, తీరంలో పర్యాటకులను తిప్పే బైక్‌లు నడిపేవారు పంచాయతీకి పన్నులు చెల్లిస్తున్నారు. మొత్తంగా ఏడాదికి రూ. 38 లక్షల వరకు తీరంపై రాబడి ఉంది. వేలం పాటలు కావడంతో రాబడిపై అందరికీ స్పష్టత ఉంది.

కొత్త దారిలో వసూళ్ల దందా

వేలం పాటలు తప్పించి గ్రామ పంచాయతీ మాటున వసూళ్లకు దిగితే రాబడిపై ఎవరికీ స్పష్టత ఉండదు, పైగా బయటవారికి ఎంత రాబడి అన్నది తెలిసే అవకాశం లేదు. అధికార పార్టీ గనక అడిగేవారూ ఉండరు. ఇదే ఆలోచనకు వచ్చిన కొందరు పచ్చనేతలు తీరంలో వసూళ్ల దందాకు తెరలేపినట్లు ప్రచారం ఉంది. వేలం పాట లేకుండా టోల్‌గేట్ పెట్టి వాహనాలకు పన్నులు వసూలు చేయాలని నిర్ణయించారు. కార్తిక మాసం రాబోతుండడంతో పచ్చనేతల వసూళ్లకు అనుకూలంగా మారింది. లక్షల్లో జనం తీరానికి వస్తారు. పెద్దఎత్తున వాహనాల రానుండంతో పన్నుల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేసుకునే అవకాశం ఉంది.

తీరం అభివృద్ధిపై కోతలు

సూర్యలంక తీరాన్ని కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తోందని పచ్చనేతలు గొప్పలు చెబుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే వంద కోట్ల రూపాయలు కేటాయించిందంటున్నారు. మరి ఈ నేపథ్యంలో పర్యాటకుల నుంచి పన్నులు వసూలు ఎందుకు చేస్తున్నారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. సొంత లాభం కోసమే వసూళ్లకు దిగుతున్నారని ఆ పార్టీ నేతలే బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు.



తీరంలో రిసార్ట్స్

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి లీలావతి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి లీలావతి

రేపల్లె రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలావతి సూచించారు. పట్టణంలోని సబ్‌జైలులో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలకు సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు జీవిత కాలం బాధలతో పాటు కుటుంబ సభ్యులు సైతం ఇబ్బందులపాలు కావాల్సిన పరిస్థితులు ఉంటాయని చెప్పారు. ఇప్పటి నుంచైనా పగలు, ప్రతీకారాలు, రాగద్వేషాలను వీడి శాంతికాముకులుగా జీవించాలని రిమాండ్ ఖైదీలకు ఆమె సూచించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. వివిధ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గుంటూరు డీఆర్వోగా ఖాజావలి

గుంటూరు వెస్ట్ : జిల్లా రెవెన్యూ అధికారిగా షేక్ ఖాజావలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గుంటూరు డీఆర్వోగా పనిచేస్తున్న పెద్దిరోజాకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం గుంటూరు డీఆర్వోగా జి.శ్రీనివాసులును నియమించారు. ఆయన విధుల్లో చేరలేదు.

కాల్వలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

- తప్పిన పెనుప్రమాదం
- బస్సులో 50 మందికి పైగా విద్యార్థులు
- అంతా సురక్షితం
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు



చినగంజాం: డ్రైవర్ అతి వేగంతో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు రోడ్డు పక్కన కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని మున్నంవారిపాలెం పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన బస్సు సాయింత్రం చినగంజాం మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులను ఎక్కించుకొని బయలుదేరింది. ఆ సమయంలో బస్సులో 50 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు. ఉప్పుగుండూరు నుంచి బయలు దేరిన బస్సు జాతీయ రహదారి నుంచి మున్నంవారిపాలెం గ్రామంలోకి వస్తోంది. సింగిల్ రోడ్డుగా ఉన్న ఆ మార్గంలో డ్రైవర్ అతివేగంగా బస్సును నడుపుతూ పక్కనే కాలువలోకి దూసుకెళ్లాడు. దీంతో విద్యార్థులు ఒకరిపై ఒకరు పడి భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థుల్ని బయటకు తీశారు. అంతా సురక్షితంగానే ఉన్నారు. ప్రమాదమేమీ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్‌ఐ శీలం రమేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- అర్జీలు వెంటనే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ జె. వెంకట మురళి అధికారుల్ని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆయన అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను విన్నవించారు. మొత్తం 148 అర్జీలు నమోదయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రులు, శాసనసభ్యులకు వచ్చిన అర్జీలను సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. జిల్లాలోని ఎస్టీలందరికీ ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. 31న దీపావళి పండుగ నేపథ్యంలో పెన్షన్ నగదును ముందస్తుగానే బ్యాంకుల నుంచి డ్రా చేసుకోవాలని తెలిపారు. ఒకటో తేదీ ఉదయం ఐదున్నర గంటలకే లబ్ధిదారులకు సచివాలయాల సిబ్బంది నగదు పంపిణీ చేయాలని ఆయన సూచించారు. అక్రమాలు జరగకుండా మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు బాధ్యత వహించాలని చెప్పారు. యువతలో నైపుణ్యాల గణన సర్వే ప్రక్రియ నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించాలని తెలిపారు. ఇందుకోసం ప్రతి మండలానికీ ఇద్దరు చొప్పున సచివాలయాల సిబ్బందిని ఎంపిక చేసి పంపాలని ఆదేశించారు. సర్వే చేసే సచివాలయాల సిబ్బందికి ఈనెల 30న శిక్షణ ఉంటుందని వెల్లడించారు.

ఏక్ తా దివాస్ ఘనంగా నిర్వహించాలి

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గురువారం ఏక్ తా దివాస్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాల్ని ప్రతి మండలంలోనూ నిర్వహించాలని ఆదేశించారు. ఆ రోజు ఉదయం 7:30 గంటలకు ర్యాలీలు, రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. బాపట్ల జిల్లా కేంద్రంలో ఉదయం ఏడున్నర గంటలకు మున్సిపల్ పాఠశాల వద్ద నుంచి గడియార స్తంభం వరకు రన్ ఫర్ యూనిటీ, ర్యాలీ కార్యక్రమాలు జరుగుతాయని, అధికారులంతా హాజరుకావాలని ఆయన సూచించారు.

సూర్యలంక బీచ్ వద్ద పోలీస్ బందోబస్తు

నవంబర్ ఒకటో తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో సూర్యలంక బీచ్ వద్ద సోమవారాల్లో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తీరం వద్ద ఎలాంటి సమస్యలు ఉత్పన్నం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని తెలుపుతూ బీచ్ వద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు.తీరంలో వైద్య శిబిరాలు సిద్ధంగా ఉంచాలని, శుభ్రమైన ఆహార పదార్థాలు అందించేలా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఆర్డీవో పి. గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి



నియామక పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్

బాపట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో ఒప్పంద, పొరుగు సేవల పద్ధతిలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను సోమవారం ఆయన అందించారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సాయం

రేపల్లె మండలానికి చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు ఒక కేసు నిమిత్తం పోలీస్ లాకప్‌లో ఉండగానే 2015లో మృతి చెందారు. దీనిపై మృతుడి తల్లిదండ్రులు యార్లగడ్డ సుబ్బారావు, వెంకటేశ్వరమ్మ జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఢిల్లీలోని కమిషన్ బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు నగదును మృతుడు తల్లిదండ్రులకు చెక్కు రూపంలో కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, కలెక్టరేట్ విభాగం పర్యవేక్షకులు సీతారత్నం, నరేష్ పాల్గొన్నారు.

రక్త దానంతో మరొకరికి పునర్జన్మ



శిబిరాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ

అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

బాపట్ల: మనం దానం చేసే రక్తం మరొకరికి పునర్జన్మ నిస్తుందని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా ఏఆర్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజల కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీంతోపాటు రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించారు. వైద్య శిబిరంలో చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ హక్, దంత వైద్య నిపుణులు అబ్రహం బ్లెస్సి, జనరల్ మెడిసిన్ నిపుణులు జాన్ పాల్, హృద్రోగ చికిత్స నిపుణులు శ్రీకాంత్, కంటి వైద్య నిపుణులు వెంకట్, ఈఎన్‌టీ నిపుణులు ఫిరోజ్ అన్వర్ తదితరులు సేవలందించారు. మొత్తం 103 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బాపట్ల ఏరియా వైద్యశాల, రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన శిబిరంలో ప్రజలు, విద్యార్థులు, పోలీసులు కలిపి మొత్తం 50 మంది రక్తదానం చేశారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన శిబిరాల్లో 270 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్‌బీ సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, బాపట్ల పట్టణ సీఐ అహ్మద్ జాని, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీను ఆత్మహత్యకు పోలీసులే కారణం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిన హనిమిరెడ్డి ధ్వజం

- పోలీసులకు సమాచారం అందించినా కాపాడలేదు
- 100 నంబర్ కేవలం టీడీపీ వాళ్లకేనా?



శ్రీను భౌతికకాయాన్ని సందర్శించిన చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: పోలీసుల నిర్లక్ష్యం వల్లే బల్లికురవ మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన చింతల శ్రీను ఆత్మహత్య చేసుకున్నాడని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలకు తట్టులేక ఈనెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన శ్రీను ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చిన హనిమిరెడ్డి ఒంగోలు వైద్యశాలలో మృతదేహాన్ని సందర్శించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ చింతల శ్రీను ఆత్మహత్య చేసుకునే ముందు తనకు ఫోన్ చేసి టీడీపీ దౌర్జన్యాలను తట్టుకోలేక పోతున్నానని వాపోయాడని చెప్పారు. ఫోన్‌లో అరగంట సేపు తాను అండగా ఉంటానని ఆత్మహత్య చేసుకోవద్దని కౌన్సెలింగ్ ఇచ్చానన్నారు. అయినా తనకు అనుమానం వచ్చి 100కు ఫోన్‌చేసి వివరాలు చెప్పానని తెలిపారు.

పోలీసులు ఆ నాలుగు గంటల్లో ఏం చేశారు ?

అద్దంకి పోలీస్‌స్టేషన్ నుంచి హెడ్ కానిస్టేబుల్ తనకు ఫోన్ చేశాడని, ఇలా ఫోన్‌లో కాదు.. అతను దర్శి రోడ్డులో ఉన్నాడని లోకేషన్ కూడా పంపి కాపాడమని చెప్పానని చిన హనిమిరెడ్డి వివరించారు. అయినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించి అక్కడకు వెళ్లలేదని ఆరోపించారు. పోలీసులకు ఉదయం 10 గంటలకు ఫోన్ చేస్తే మధ్యాహ్నం రెండు గంటలకు ఘటన జరిగిందని చెప్పారు. ఇదంతా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై పోలీసులకు ఉన్న నిర్లక్ష్యమే కారణమని ధ్వజమెత్తారు. దళిత రైతు అని చెప్పినా స్పందించకపోవటం విడ్డూరంగా ఉందని ఖండించారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరూ 100కు డయల్ చేస్తారన్నారు. ఇక నుంచి 100 నంబర్‌ని టీడీపీ వాళ్లకు మాత్రమే పని చేస్తామని పోలీసులు ప్రచారం చేసుకోవాలని ఆయన విమర్శించారు. పోలీసులు తమ టోపీలకు బదులు టీడీపీ జెండాలు కప్పుకోవాలని ఆయన సూచించారు. పోలీసుల వైఫల్యంతో దళిత రైతు మరణానికి కారణం అయిందని చిన హనిమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇలాంటి చర్యలకు మద్దతు ఇస్తున్నారని మండిపడ్డారు. చింతల శ్రీను కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట అద్దంకి మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిరు వ్యాపారి మృతి



కుమార్ మృతదేహం

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో చిరు వ్యాపారి మృతి చెందిన ఘటన మండలంలోని మార్టూరు జాతీయ రహదారిపై నూలుమిల్లు సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాల మేరకు.. తెనాలికి చెందిన పగడాల కుమార్ (45) ద్విచక్ర వాహనంపై తిరుగుతూ వస్త్ర వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తెనాలి నుంచి నెల్లూరుకు బైకుపై బయలుదేరాడు. సోమవారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో మార్టూరు జాతీయ రహదారిపై నూలు మిల్లు సమీపంలో వాహనం అదుపుతప్పి రెండు రోడ్ల మధ్యగల డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో కుమార్ బైక్ సహా ఎగిరి అటువైపు ఒంగోలు నుంచి మార్టూరు వైపు వెళ్లే రోడ్డుపై పడిపోయాడు. ప్రమాద తీవ్రతకు కుమార్ తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు కుమార్‌కు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసిన ఏఎస్ఐ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శవ పంచనామా చేయించి బంధువులకు అప్పగించారు.

'బెల్టు'తో ఫుల్ కిక్కు

- మద్యం మత్తులో పల్లెలు
- సందుసందుకో బెల్టు షాపు
- ఏరులై పారుతున్న మద్యం
- చోద్యం చూస్తున్న అధికారులు
- నిబంధనలకు పాతరేసిన వ్యాపారులు
- ధనార్జనే ధ్యేయంగా మద్యం అమ్మకాలు

వేటపాలెం: కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన విద్య, వైద్యం దొరకడం లేదు గానీ మద్యం మాత్రం సులభంగా దొరుకుతోంది. 'తాగుదాం.. తాగి ఊగుదాం' అంటూ మందుబాబులు చిందులేస్తూ ఒళ్లుగుల్ల చేసుకుంటున్నారు. కొత్త మద్యం పాలసీ అందుబాటులోకి రావడంతో ప్రైవేట్ మద్యం దుకాణాల తలుపులు తెరుచుకున్నాయి. రూ. 99 కే మద్యం దొరుకుతుందని దుకాణాల వద్దకు వెళ్లిన మందుబాబులకు నాసిరకం మద్యంతో నిరాశే ఎదురైంది. లాటరీలో షాపు దక్కించుకున్న వ్యక్తులు ఎక్కడైనా నిర్వహించుకోవచ్చని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో పలుచోట్ల నిబంధలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేశారు.

పేదలే సమిధలు

వేటపాలెం మండలంలో ఐదు మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిల్లో పందిళ్లపల్లి, కొత్తపేట, వేటపాలెం కుందేరులో ఒక్కో షాపు ఏర్పాటు చేశారు. దేశాయిపేట ప్రధాన రహదారి పక్కన రెండు షాపుల చొప్పున ప్రారంభమయ్యాయి. అయితే, మద్యం దుకాణాలు తెరుచుకున్న మొదటి రోజు నుంచే పల్లెల్లోను, కాలనీల్లో బెల్ట్ షాపుల సంఖ్య పెరిగిపోయాయి. షాపులు యజమానులు పోటీపడి మరీ తెరుస్తున్నారు. ప్రధానంగా పేదలు ఎక్కువుండే కాలనీలో వారిని టార్గెట్‌గా ఏర్పాటు చేస్తున్నారు. వేటపాలెంలో రైల్వే గేటు అవతల యానాది కాలనీలో, జీడిపప్పు కార్మికులు నివాసం ఉండే సర్వోదయ కాలనీ, దేశాయిపేట, పంచాయతీ యానాదులు నివాసం ఉండే జీవరక్షానగర్ కాలనీలో, రామన్నపేటలో యానాదుల కుటుంబాలు ఉండే విఘ్నేశ్వర కాలనీలో బెల్టు షాపుల ఏర్పాటు చేసి పేదల పొట్ట కొడుతున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ము మద్యం కొనుగోలు చేయడానికి వెచ్చిస్తున్నారు. దీనింతో పేదల కుటుంబాలు బజారున పడే పరిస్థితి ఏర్పడింది. బెల్టు షాపుల్లో ఎమ్మార్పీ కంటే రూ. 20 నుంచి 30 అధికంగా విక్రయిస్తున్నారు.



రైల్వేస్టేషన్ అవతల పాత గేటు వద్ద ఏర్పాటు చేసిన బెల్టుషాపు

నిబంధనలకు పాతర

గత ప్రభుతంలో బెల్ట్ షాపులు లేకుండా కఠినంగా వ్యవహరించారు. ప్రస్తుతం ప్రతి కాలనీ, గ్రామంలో బెల్ట్ షాపులు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. మద్యం దుకాణాలను లాటరీలో దక్కించుకున్న వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, పాఠశాలలకు 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలనే నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ప్రస్తుతం వీటికి పాతర వేశారు. బెల్టుషాపుల నిర్వహణపై పోలీసు ఎక్సైజ్ అధికారుల చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

చుండూరు(వేమూరు): క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు.చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం 68వ అంతర జిల్లా అండర్- 17 బాలురు, బాలికల చదరంగం పోటీల్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి మన దేశంలో చదరంగం ప్రసిద్ధ గాంచినట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం కుర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలల్లో ఈ నెల 28,29 తేదీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13 జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. క్రీడలు నిర్వహణకు సహకరించిన శివరామప్రసాద్, రావి సాయిబాబును సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ మంతాజ్, దుండిపాలెం సర్పంచ్ భగవద్గీత, ఎంపీటీసీ యన్. ప్రసన్నకుమారి, మండల విద్యాశాఖాధికారి ఆర్. చలపతిరావు, ఎం. సాల్మన్, బాపట్ల జిల్లా స్కూల్ గేమ్ సెక్రటరీ షేక్ కరీముల్లా, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమూరి శరత్‌బాబు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ భయ్యా సతీష్, తమ్మా శివారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చదరంగం ఆడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

సత్రం పునః నిర్మాణానికి శంకుస్థాపన

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరులో దేవదాయ శాఖ పరిధిలోని లోకల్ ఫండ్ సత్రం పునః నిర్మాణానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ. 70 లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు కార్య నిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొజ్జా రవి, తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్‌వీ రమణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మోటూరు పుణ్య శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు వాకా వెంకటనారాయణ పాల్గొన్నారు.

అర్చకులంతా ఐకమత్యంగా ఉండాలి



నూతన కార్యవర్గం సభ్యులతో అర్చకులు

జిల్లా గౌరవ అధ్యక్షుడు కృష్ణమాచార్యులు

కర్లపాలెం: జిల్లాలోని అర్చకులంతా ఐకమత్యంగా ఉండాలని బాపట్ల జిల్లా అర్చక సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు నల్లూరి పాంచజన్య కృష్ణమాచార్యులు చెప్పారు. బాపట్ల జిల్లా అర్చక సేవా సంఘం సమావేశం సోమవారం పెద్దింటమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించారు. సంఘం బాపట్ల జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందివెలుగు శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శిగా బృందావనం గోపీచంద్, కోశాధికారిగా శ్రీనివాసుల రామభార్గవ్, సమన్వయకర్తగా మేడూరి శ్రీనివాసమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికను రాష్ట్ర అధ్యక్షులు నారాయణ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వరశాస్త్రి, ఉపాధ్యక్షులు బృందావనం శ్రీనుబాబు, గూడూరి శ్రీనివాసబాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అర్చకులు అనంత చక్రవర్తి, పరాశరం రమేష్, దిట్టకవి లక్ష్మణాచార్యులు, యోగానంద్, వినుకొండ సత్యంబాబు, కర్లపాలెం మండల ఆదిశంకర బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించి ఆదుకోండి

కొల్లూరు: వరదల కారణంగా పనులు కరువైన నేపథ్యంలో ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ వరద ప్రభావిత ప్రాంత ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని ఆవులవారిపాలెం శివారు క్రీస్తులంకకు చెందిన ప్రజలు నిరసనలో పాల్గొన్నారు. కృష్ణా నదికి వరదలు సంభవించడం కారణంగా వ్యవసాయంతో పాటు ఇటుకరాయి పరిశ్రమలో సైతం పనులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల నుంచి జీవనం కష్టంగా మారిందని తెలిపారు. పల్లె పండుగల పేరుతో ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దారుణమని ఖండించారు.తక్షణం ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్కరికీ 200 పనిదినాలు కల్పించడంతోపాటు, రూ. 600 రోజువారి కూలీ అందజేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ నరసింహారావుకు వినతి పత్రం అందజేశారు.

ప్రభాస్ కటౌట్ విషయంలో ఘర్షణ

బల్లికురవ: ప్రభాస్ కటౌట్ విషయంలో జరిగిన వివాదంలో రెండు కుటుంబాల మహిళలు ఘర్షణకు పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని ఉప్పుమాగులూరు ఎస్సీ కాలనీలో సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. పది రోజుల క్రితం ప్రభాస్ కటౌట్ విషయమై ఎస్సీ కాలనీలో కొంత వివాదం తలెత్తింది. ఈ క్రమంలో దీన్ని దృష్టిలో పెట్టుకొని కాలనీకి చెందిన ఒంటరి ప్రభావతి, జొన్నలగడ్డ మరియమ్మల మధ్య తిరిగి సోమవారం వివాదం జరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ఒకరిని మార్టూరు వైద్యశాలకు, మరొకరిని అద్దంకి వైద్యశాలకు చికిత్సకు తరలించారు.

రసాయనిక ఎరువులతో ప్రమాదం

చినగంజాం: సాగులో రసాయనిక ఎరువుల వాడకం ఎంతో ప్రమాదకరం అని జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ డీపీఎం వాణిశ్రీ అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెంలో ప్రకృతి వ్యవసాయం ఆధారంగా పంటలు పండిస్తున్న పలువురు రైతుల భూముల్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అభివృద్ధి కోసం ప్రతి రైతూ కృషి చేయాలని, తద్వారా పండించిన పంటలు మానవాళికి ఎంతో మేలని చెప్పారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, పూర్తిగా ప్రకృతి వ్యవసాయంపైనే ఆధారపడి సాగు చేయాలని ఆమె సూచించారు. కేవలం ప్రకృతిలో లభించే పదార్థాలతో రైతులు సొంతంగా తయారు చేసుకునే కషాయాలతో ప్రకృతి వ్యవసాయంలో సాగును కొనసాగించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మోహన్, ఎస్ఎఫ్ఏ వర్ధనమ్మ, లక్ష్మి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో బాధితులకు న్యాయం

ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల: చట్టపరిధిలో సమస్యలను విచారించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ తుషార్ డూడీ అధికారుల్ని ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు సమస్యల్ని ఎస్పీ తుషార్ డూడీకి విన్నవించుకున్నారు. ఆయన వాటిని విన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడారు. సమస్యల్ని చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అర్జీలను చట్టపరిధిలో విచారించి పరిష్కరిస్తామని బాధితులకు భరోసా కల్పించారు.జిల్లాలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు, ఇతర పలు సమస్యలతో 44 మంది అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పీజీఆర్ఎస్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యను వింటున్న ఎస్పీ

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నిజాంపట్నం: నాటు సారాకు ఉపయోగించే బెల్లం ఊటను మండలంలోని జంపనివారిపాలెంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది సోమవారం ధ్వంసం చేశారు. నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో సిబ్బంది జంపనివారిపాలెం గ్రామ శివారులోని అడవుల్లో దాడులు నిర్వహించారని తెలిపారు. ఇందులో ఏడు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో 700ల లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు చెప్పారు. నిందితులు పరారయ్యారని, త్వరలో వారిని అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాల్లో నాటుసారా కాచినా, విక్రయించినా తమకు ప్రజలు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్స్ వెంకటరమణ, పి.శ్రీనివాసరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, డ్రైవర్ భాస్కర్ పాల్గొన్నారు.



మద్యం దుకాణం ఎత్తివేయాలని కోరుతూ ఆందోళన

ఎక్సైజ్ అధికారులకు అర్జీలు సమర్పించిన మహిళలు

చినగంజాం: ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఎత్తివేయాలని మహిళలు ఆందోళన చేపట్టారు. మండలంలోని కడవకుదురులో షాపును నిర్వాహకులు స్థానిక బస్టాండు నుంచి రైల్వేగేటుకు వెళ్లే మార్గంలో ఇళ్ల మధ్య ఏర్పాటు చేశారు. దీంతో మహిళల్లో వ్యతిరేకత ప్రారంభమైంది. గడిచిన రెండు రోజులుగా ఆందోళనకు దిగారు. దుకాణంలో మద్యాన్ని అమ్మనీయకుండా అడ్డుపడ్డారు. దాంతో షాపు నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించారు.దీంతో షాపు దగ్గర ఎటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సమస్యను ఎక్సైజ్ అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని పోలీసులు ఆందోళనకు దిగిన మహిళలకు సలహా ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలను కలిసి అర్జీలు సమర్పించారు. దుకాణాన్ని ఎత్తి వేయాలని కోరారు.

దుకాణ నిర్వాహకులతో మహిళల వాగ్వాదం

అధికారులకు సమస్యను తెలియజేసినప్పటికీ మద్యం దుకాణాన్ని కొనసాగిస్తుండటంతో సోమవారం రాత్రి మహిళలు మరలా అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. షాపు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. దుకాణాన్ని తక్షణం ఎత్తి వేసి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాన్ని ఎత్తి వేయకపోతే ధర్నాకు దిగుతామని వారు నిర్వాహకుల్ని హెచ్చరించారు.




మద్యం దుకాణ నిర్వాహకుడితో మాట్లాడుతున్న మహిళలు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో గుంటూరు జట్ల జయకేతనం



విన్నర్స్‌గా నిలిచిన గుంటూరు జిల్లా బాలుర జట్టు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాలురు, బాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో గుంటూరు జిల్లా జట్లు విజయకేతనం ఎగురవేశాయి. బాలుర విభాగంలోనూ, బాలికల విభాగంలోనూ జిల్లా జట్లు ఫైనల్స్‌లో తమ ప్రత్యర్థి జట్లను ఓడించి, విన్నర్స్‌గా నిలిచాయి. ఈనెల 26న స్థానిక క్రీడాస్టేడియం మైదానంలో ప్రారంభమైన ఈ పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు రన్నర్స్ స్థానాన్ని కైవసం చేసుకోగా, ప్రకాశం జిల్లా జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది. బాలికల విభాగంలో కృష్ణాజిల్లా జట్టు రన్నర్స్‌గా నిలవగా, ప్రకాశం జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. పోటీల అనంతరం జరిగిన సభలో రోటరీక్లబ్, తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ కోశాధికారి ఈదర వెంకట పూర్ణచంద్, స్వర్ణ హోటల్ అధినేత సుధీర్‌బాబు, గుంటూరు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎం.రవి, అసిస్టెంట్ సెక్రటరీ బి.రమేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ వినయ్‌కుమార్ విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, మెడల్స్‌ను బహూకరించారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన తెనాలి డబుల్ హార్స్ యాజమాన్యానికి, రోటరీ క్లబ్‌కు, స్వర్ణ హోటల్‌కు నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు. టోర్నమెంటు ముగిసిన అనంతరం నవంబరు నెలాఖరులో ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు.



గుంటూరు జిల్లా బాలికల జట్టు

నేడు సిరిపురంలో ఉమ్మడి జిల్లాస్థాయి పరుగు పందెం పోటీలు

మేడికొండూరు: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం ఉమ్మడి జిల్లా స్థాయి పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి పరుగు పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. 14 ఏళ్లలోపు బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని వెల్లడించారు. గుంటూరు ఉమ్మడి జిల్లాలోని 17 నియోజకవర్గాల నుంచి సుమారు 750 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి తెలిపారు

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుందరాచారి



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం డాక్టర్ సుందరాచారి మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాలలో 1981లో ఎంబీబీఎస్ చదివి, అనంతరం న్యూరాలజీ పీజీ చేసి 2001లో జీజీహెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా గుంటూరు జీజీహెచ్‌లో పనిచేశారు. గత ఏడాది రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డును ఈయన అందుకున్నారు. న్యూరాలజీ విభాగాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ విభాగంగా తీర్చిదిద్దారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వార్డులో స్లీప్ ల్యాబ్, స్ట్రోక్ యూనిట్ ఏర్పాటుచేసి నాణ్యమైన వైద్య సేవలతో 2018లో ఐఎస్ఓ గుర్తింపు సైతం న్యూరాలజీ వార్డుకు లభించడంలో డాక్టర్ సుందరాచారి కృషి ఎనలేనిది. 2022లో ఫెలో ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీగా ఎన్నికై అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. ఈఏడాది జనవరిలో డాక్టర్ సుందరాచారికి అడిషనల్ డీఎంఈగా ప్రమోషన్ ఇచ్చి మచిలీపట్నం వైద్య కళాశాలకు బదిలీ చేశారు. ఇప్పుడు తిరిగి గుంటూరు వైద్య కళాశాలకు బదిలీ చేశారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉత్తర్వులు అందుకున్న డాక్టర్ సుందరాచారికి పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేటి నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

మార్కెట్ యార్డు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి రజని



తాడికొండ: సీసీఐ కొనుగోలు కేంద్రం ద్వారా తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు తరుపున పత్తి కొనుగోళ్లు మంగళవారం నుంచి ప్రారంభించనున్నామని తాడికొండ మార్కెట్ యార్డు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పి రజని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7521 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు సీసీఐ కేంద్రానికి పంటను తీసుకెళ్లాలంటే ముందుగా రైతు సేవా కేంద్రాల వద్ద ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ అందజేయాల్సి ఉంటుందన్నారు. తేమ శాతం 8-12 శాతం మాత్రమే ఉన్న పత్తిని కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. తడిచిన, రంగు మారిన పత్తిని కొనుగోలు చేయరని స్పష్టం చేశారు. ఈ పంట/ ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు/ కౌలు రైతులు మాత్రమే పత్తి కొనుగోలు కేంద్రానికి రావాలని వెల్లడించారు. అన్ని అర్హతలు ఉన్న రైతులు గుంటూరు శివారు ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామంలోని శివసాయి టీఎంసీ సిండికేట్ మిల్లుకు పత్తిని తీసుకొస్తే ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు.

విద్యార్థులకు ఉచిత స్కూల్ బస్ సౌకర్యం

జే.పంగులూరు: మండల పరిధిలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సౌకర్యార్థం కొండమంజులూరు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బొప్పూడి నాగేశ్వరావు తల్లి వనజాక్షమ్మ జ్ఞాపకార్థం రూ. 10 లక్షలతో ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. కొండమంజులూరు పాఠశాలకు పక్క గ్రామాల నుంచి 150 మంది వరకు బాలబాలికలు వస్తుంటారు. ఇందుకు వీలుగా పాఠశాలకు బస్సు ఏర్పాటు చేసినట్లు దాత నాగేశ్వరావు తెలిపారు. ఆయన తండ్రి సంజీవనాయుడు సోమవారం బస్సును ప్రారంభించారు.పాఠశాల హెచ్ఎం అనిత మాట్లాడతూ పాఠశాలకు దాతల సహకారం మరువలేదన్నారు. బస్సు ఏర్పాటు చేసినందుకుగాను కోటపాడు, నార్నెవారిపాలెం, బైటమంజులూరు గ్రామాల బాలబాలికలు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎంసీ కమిటీ చైర్మన్ గోలి సంధ్యారాణి, వైస్ చైర్మన్ నరసింహారావు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న దాత